క్రీడాభివృద్ధికి పెద్ద పీట

- చిగిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు మహర్దశ
- క్రీడా సదుపాయాల కల్పనకు రూ.1.20 కోట్లు మంజూరు
- నిర్మాణం కానున్న ఇండోర్ స్టేడియం, హాకీ మైదానం


మైదానంలో హాకీ ఆడుతున్న క్రీడాకారులు

ధర్మవరం రూరల్: విద్యార్థుల దేహదారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ఉపకరిస్తాయి. అందుకోసమే ప్రభుత్వం చదువులతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇస్తోంది. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా చర్యలు తీసుకుంటోంది. ప్రతి పాఠశాలలో అవసరమైన క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచుతోంది. మైదానాలను సిద్ధం చేస్తోంది. క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈక్రమంలో చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాసదుపాయాల కల్పనకు నిధుల వరద పారింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు చిగిచెర్ల గ్రామానికి చెందిన ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి గారి ఓబిరెడ్డి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఇటీవల జరిగిన స్పోర్ట్స్ డైరెక్టర్ల సమావేశంలో పాఠశాలకు క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం నిర్మాణం, హాకీ మైదానం తదితర వాటి కోసం నిధులు మంజూరు చేయించారు.

మైదానంలోకి దిగితే పతకం రావాల్సిందే

చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు(క్రీడాకారులు) హాకీ, జూడో పోటీల్లో జాతీయ స్థాయిలో పతకాలను సాధించి అటు పాఠశాలకు, ఇటు గ్రామానికి ఎంతో పేరు ప్రతిష్టలు తెస్తున్నారు. ఈ పాఠశాలలోని క్రీడాకారులు 150 మంది దాకా జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.


సౌత్ జోన్ నేషనల్ టోర్నీలో పతకం సాధించిన క్రీడాకారిణి యశ్వితను అభినందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి(ఫైల్)

జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు



చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీ, జూడో తదితర పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. పాఠశాలలో క్రీడలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం వల్ల గ్రామీణ క్రీడాకారులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అవకాశం ఏర్పడింది.

-ప్రతాప్‌రెడ్డి, పీఈటీ, చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

క్రీడాభివృద్ధికి కృషి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాభివృద్ధికి కోట్లాది రూపాయలను కేటాయిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో చిగిచెర్ల పాఠశాలలో క్రీడా మైదానాల ఏర్పాటు చేయించడం, విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నాం. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వంతో చర్చించి వీలైనన్ని నిధులు మంజూరు చేయిస్తున్నా. గ్రామీణ స్థాయి క్రీడాకారులను జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేస్తున్నా.

-బుచ్చిరెడ్డి గారి ఓబిరెడ్డి, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్

క్లుప్తంగా

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు చెన్నకేశవప్రసాద్, రామరాజులు మంగళవారం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు, ఇంటర్‌ను మధ్యలోనే ఆపేసినవారు విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు చేరవచ్చని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

నల్లచెరువు: తలమర్లవాండ్లపల్లి గ్రామం, దేవిరెడ్డిపల్లి నుంచి యాతంబావి గంగమ్మ గుడి వరకు ఉపాధి హామీ కింద జరుగుతున్న మట్టి రోడ్డు పనులను ఎంపీడీఓ శకుంతల మంగళవారం పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ప్రతి కూలీకి రోజువారి వేతనం రూ.257 లభించేలా సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో పనుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ సిబ్బందికి సూచించారు.

అనుమతి లేకుండా భవనాల నిర్మాణం


అధికారుల అనుమతి లేకుండా జరుగుతున్న భవన నిర్మాణ పనులు

నల్లచెరువు: మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే దాదాపు 55 సెంట్లలో ఎలాంటి అనుమతి లకుండా కొందరు వ్యక్తులు భవనాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే గుంతలు తవ్వి పిల్లర్లు నిర్మించారు. అయినప్పటికీ అధికారులు చోద్యం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ విషయంపై ఈఓఆర్డీ దివాకర్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్ట రీత్యా నేరమన్నారు. అక్రమంగా భవనాలు నిర్మిస్తున్న వారికి ఇప్పటికే నోటీసులు అందజేశామని తెలిపారు. స్పందించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ


ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు

బత్తలపల్లి: రామాంజులపల్లి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలు 14 మందికి మండలంలోని దంపెట్ల గ్రామ సచివాలయంలో దంపెట్ల సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు మంగళవారం ఇంటి పట్టాలు అందజేశారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలకు ఆర్డీటీ సంస్థ ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రావడంతో తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. వీఆర్ఓ నర్సింహులు, కార్యదర్శి భారతి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బాధితురాలికి రూ.10 వేలు అందజేస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎంపీపీ హేమలత తెలిపారు. రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన బాబు (49) అనే వ్యక్తి అనారోగ్యంతో మరణించాడు. ఆయన కుటుంబసభ్యురాలు రాములమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద మంజూరైన రూ.10 వేలను మంగళవారం ఆత్మకూరులో ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, వన్నూరప్ప, అశ్విని, శ్రీరాములు పాల్గొన్నారు.

మామిడి చెట్లు దగ్ధం

పెనుకొండ రూరల్: అడవికి నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కోనాపురంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రైతు శ్యామ్ ప్రసాద్ వివరాలు మేరకు... గుర్తు తెలియని వ్యక్తులు అటవీ ప్రాంతానికి నిప్పు పెట్టడంతో మామిడి తోటకి మంటలు వ్యాపించాయి. దీంతో దాదాపుగా 33 చెట్లు కాలిపోయినట్లు బాధిత రైతు శ్యామ్‌ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అసిస్టెంట్ భారతి మంగళవారం రైతుకి చెందిన తోటను పరిశీలించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు.

సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోండి

ధర్మవరం రూరల్: బుధవారం నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని డీవీఈఓ రఘునాథరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. పట్టణంలోని 5 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, సంజయ్ నగర్‌లోని వాసవీ జూనియర్ కళాశాల, గుట్టకిందపల్లిలోని మోడల్‌స్కూల్, సాయినగర్‌లోని సీతారామయ్య బాలికల కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 8.30 గంటలకే కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకోవాలన్నారు. చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదన్నారు.

కదిరి అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. కదిరి పట్టణంలో 3 సెంటర్లు, రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లిస్వీస్ కళాశాలలో ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ నాలుగు కేంద్రాల్లో మొత్తం 1600 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

వైభవంగా కుర్లపల్లయ్య స్వామి ఊరేగింపు


ఊరేగుతున్న కుర్లపల్లయ్య స్వామి

రాప్తాడు: మండల కేంద్రంలో మంగళవారం ధర్మపురి కుర్లపల్లయ్య స్వామిని కురుబ కులానికి చెందిన పామాల్ల వంశస్తులు వైభవంగా ఊరేగించారు. రాప్తాడుకు చెందిన పామాల్ల కొండప్ప, పామాల్ల సరస్వతి దంపతుల గృహ ప్రవేశ మహోత్సవానికి తమ ఇంటి ఇలవేల్పు అయిన కుర్లపల్లయ్య స్వామిని శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం రూరల్ మండలం ధర్మపురి గ్రామం నుంచి రాప్తాడుకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రంతా భక్తిశ్రద్ధలతో స్వామిని ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులను తీర్చుకున్నారు. వేడుకలను తిలకించేందుకు మండలం నుంచే గాక ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో వీధులు జనసంద్రమయ్యాయి. యువతులు, మహిళలు ప్రతి ఇంటి నుంచి స్వామి వారికి బిందెలతో నీరు పోసి మొక్కులను తీర్చుకున్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: గాలికుంటు నివారణకు పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి తులసీరామ్ తెలిపారు. సింగంపల్లి తండా గ్రామంలో మంగళవారం ఆయన పశువులకు టీకాలు వేశారు. పశువులకు జ్వరం, కాలి గిట్టల చీళ్లు తదితర సమస్యలు రాకుండా ఉండేందుకు టీకాలు ఉపయోగపడతాయన్నారు. ఆవులు, ఎనుములకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్ నాయక్ తదితర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి పరిశుభ్రత ముఖ్యం


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్.సాల్మాన్

కనగానపల్లి: పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి పరిశుభ్రత చాలా ముఖ్యమని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్. సాల్మాన్ తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మామిళ్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణపై సిబ్బందితో మాట్లాడారు. తర్వాతా ఆరోగ్య సిబ్బందితో కలసి చిన్నారులకు ఆల్బెండోజోల్ మాత్రలు వేశారు. అనంతరం కనగానపల్లిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదగాలంటే పరిశుభ్రతతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు చెన్నారెడ్డి, భానురేఖ, సీహెచ్ఓ గోవిందమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, మునిలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత


మాట్లాడుతున్న వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తోందని వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో వీరబ్రహ్మేంద్ర మహిళ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని డ్వాక్రా సంఘాల లీడర్లు, సభ్యులు, పలువురు మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ, సున్నా వడ్డీ పథకాలను అమలుచేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తున్నారన్నారు. మహిళలు సక్రమంగా వినియోగించుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం హేమలత, డ్వాక్రా సంఘం మండల లీడర్లు నల్లమ్మ, రాములమ్మ, పలువురు గ్రామ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

- నేటి మధ్యాహ్నం నుంచి ఆలయం మూత
- గురువారం నుంచి మళ్లీ యథావిధి దర్శనం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ దశమి (ఈ నెల 2న) అంకురార్పణంతో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ బ్రహ్మోత్సవాలు గురువారం జరగనున్న పుష్పయాగోత్సవంతో ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తీర్థవాది ఉత్సవం బుధవారం భృగుతీర్థంలో భక్తుల కోలాహలం మధ్య జరగనుంది. ఉదయం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవిల సమేతంగా స్వామి వారు వసంతోత్సవాలు జరుపుకుంటారు. అనంతరం శ్రీదేవి, భూదేవిలతో కలిసి శ్రీవారు భృగుతీర్థంలోకి వెళ్లి అక్కడ చక్రస్నానం ఆచరిస్తారు. అనంతరం విశేషాలంకరణతో తిరువీధుల గుండా తిరిగి ఆలయం చేరుకుంటారు.

ధ్వజావరోహణం: బ్రహ్మోత్సవాల ప్రారంభం నాడు ఆలయం ముందు ధ్వజ స్థంబానికి కట్టిన కంకణాలు బుధవారం మధ్యాహ్నం విప్పేస్తారు. అంటే ధ్వజావరోహణం గావిస్తారు. దీంతో తీర్థవాది ఉత్సవం ముగుస్తుంది. అనంతరం శ్రీవారు మధ్యాహ్నం 2 గంటలకు ఆలయంలోకి ప్రవేశిస్తారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి స్వామి వారు యాగశాలలోనే గడిపారు. నేటి మధ్యాహ్నం 2 గంటల నుండి ఆలయం తలుపులు మూసివేస్తారు. అప్పటి నుంచి రోజంతా శ్రీవారి దర్శనం ఉండదు. తిరిగి గురువారం ఉదయం నుండి స్వామివారు ఆలయంలో యధావిధిగా తన భక్తులకు దర్శనమిస్తారు.


అలుకోత్సవానికి హాజరైన భక్తులు


విద్యుద్దీపాలంకరణలో ఆలయ నాలుగు గోపురాలు

విద్యార్థుల ఆరోగ్యపరిరక్షణే ధ్యేయం


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీపీఎంఓ డాక్టర్ చిన్నకుళ్లాయప్ప


ధర్మవరం రూరల్: మాత్రలు వేస్తున్న స్పెషలాఫీసర్ రామాంజినేయులు


తాడిమర్రి కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సరస్వతి


బత్తలపల్లి: మండలంలోని సంజీవపురంలో మాత్రలు వేస్తున్న అధికారిణి పద్మమ్మ

- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఓడీ చెరువు: పిల్లల్లో రక్తహీనతకు, పోషకాహార లోపానికి కారణమవుతున్న నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలే అస్త్రం. అందులో భాగంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని చేపట్టారు. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. రక్తహీనత నివారణతో ఆరోగ్యకర కుటుంబం ఏర్పడుతుందని (ప్రోగ్రాం మానటరింగ్ ఆఫీసర్) డీపీఎంఓ డాక్టర్ చిన్న కుళ్లాయప్ప అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఓడీ చెరువు మండలం అల్లాపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని డీపీఎంఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఎదుగుదల లేకపోవడానికి రక్తహీనత కారణమన్నారు. కడుపులో నులిపురుగులు ఆహారంలోని పోషకాలను సంగ్రహిస్తాయని, తద్వారా రక్తహీనత ఏర్పడి అనారోగ్యానికి గురతారని అన్నారు. నులిపురుగుల నిర్మూలనకు 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వయస్సు వారు మండలంలో 10,300 మంది ఉన్నారన్నారు. డాక్టర్ భానుప్రకాష్ నాయక్, సీహెచ్ఓ సుభాషిణి పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నేలకోట, బిల్వంపల్లి, దర్శనమల తదితర గ్రామాలలో చేపట్టిన ఆల్బెండ్‌జోల్ మాత్రల పంపిణీని స్పెషల్ నోడల్ అధికారి రామాంజినేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డాక్టర్లు పుష్పలత, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

తాడిమర్రి: చిన్నారులు, విద్యార్థుల్లో నులిపురుగులు నివారిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ, నోడల్ ఆఫీసర్ సరస్వతి పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జరిగిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఆమె ప్రారంభించి మాట్లాడారు వైద్యాధికారి మహేంద్రనాథ్, సీహెచ్ఓ హేమలత, ఎస్ఓ వాణిశ్రీ, హెచ్ఎం జగన్మోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ, ఎంపీహెచ్ఈఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

బత్తలపల్లి: ఎన్‌డీడీ కార్యక్రమం నోడల్ అధికారిణి (సిరికల్చర్ జేడీ) పద్మమ్మ మండలంలోని సంజీవపురం వద్దనున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి గంగిరెడ్డి, ఎంఈఓ చాముండేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక జెడ్పీ ఉఉనసత పాఠశాలలో వైద్యాధికారి మహేశ్వరమారుతి, ఎంపీపీ జగన్మోహన్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 4756 మంది విద్యార్థులు ఉండగా 4612 మంది(75శాతం)కి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు వైద్యాధికారి మహేశ్వరమారుతి తెలిపారు. మిగిలిన విద్యార్థులకు ఈ నెల 18న పంపిణీ చేస్తామని తెలిపారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో డాక్టర్ రాజేంద్ర విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి కళ్యాణి పర్యవేక్షించారు.


మాత్రల పంపిణీపై ఆరాతీస్తున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ ఐనోద్దీన్

కదిరి అర్బన్: కాళసముద్రం గురుకుల పాఠశాలలో పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ లక్ష్మీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ దాదాపీర్ పాల్గొన్నారు.

'ఆల్బెండజోల్'తో నులిపురుగుల నివారణ

ఎన్పీకుంట: మండల కేంద్రంతో పాటు, పెడబల్లి గ్రామంలోని పాఠశాలల్లో వైద్యాధికారులు డాక్టర్ షేక్ ఆసియా, డాక్టర్ ఆనంద్ వర్ధన్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 4973 మందికి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈఓఆర్డీ మనోహర్ పాల్గొన్నారు.

తలుపుల: మండలంలో జరిగిన ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ ఐనోద్దీన్ పర్యవేక్షించారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్యాశాఖ కోఆర్డినేటర్ తిప్పేంద్ర నాయక్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 4900 మందికి మాత్రలు వేసినట్లు డాక్టర్ గణేనాయక్ తెలిపారు. మిగిలిన పిల్లలకు మాత్రలు వేస్తామని చెప్పారు. ఎంపీడీఓ శకుంతల ఎంఈఓ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

చట్టాలపై గ్రామీణులకు అవగాహన

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామంలో టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పడిన అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ చట్టం, గృహహింస, వేధింపులు, బాల్య వివాహాలు తదితర వివిధ చట్టాలపై వివరించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ఎక్కడైనా మహిళలపై వేధింపులు, గృహహింసలను ఎదుర్కొంటుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

నల్లచెరువు: బాలికపై ఓ యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఒక మైనర్ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండగా బాలేపల్లి తండాకు చెందిన జగదీష్ నాయక్ అనే యువకుడు లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ వడ్రహట్టి క్రాస్ కల్వర్టు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులైన గౌడప్ప, సన్నరంగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని చర్లోపల్లికి చెందిన దంపతులు స్వగ్రామం నుంచి బంధువుల ఇంటికి బైక్‌లో వెళ్తుండగా ఆర్.వడ్రహట్టి క్రాస్ మలుపు వద హెచ్‌టీ హళ్లి వైపు నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సన్నరంగమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తుమకూరుకు తరలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486